# ఆదిలాబాద్ వార్త



**మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్**

**శనివారం 3, జనవరి 2026**


## నోడల్ అధికారులు విధులను సమర్ధవంతంగా నిర్వహించాలి

**★ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**



**ఆసిఫాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులకు కేటాయించిన విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం సాయంత్రం సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపల్ ఎన్నికలలో నోడల్ అధికారులకు కేటాయించిన విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని తెలిపారు. కాగజ్ నగర్ మున్సిపాలిటీకి మ్యాన్ పవర్ మేనేజ్మెంట్ నోడల్ అధికారిగా సబ్ కలెక్టర్, ఆసిఫాబాద్ మున్సిపల్ మ్యాన్ పవర్ మేనేజ్మెంట్ నోడల్ అధికారిగా ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి వ్యవహరిస్తారని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి శిక్షణా మిగతా 2లో..



## క్రీడాకారులను అభినందించిన కలెక్టర్

**నిర్మల్‌రూరల్, జనవరి 2, ప్రభాతవార్త:**

వూషూ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన వూషు ఫెడరేషన్ కప్ క్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అభినందించారు. విద్యార్థులకు పతకాలను అందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాక్షించారు. వారికి శుభాకాంక్షలు తెలిపారు. కాగా విద్యార్థులు నర్వాడే రుద్ర, అబ్దుల్ రహ్మాన్, గోరా ఆనన్యలు, డిసెంబర్ 24 నుంచి 30వ తేదీ వరకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో, వూషూ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన వూషు ఫెడరేషన్ కప్ క్రీడా పోటీలలో కాంస్య పతకాలు సాధించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వార్షిక రుణ లక్ష్యాల సాధనకు సమన్వయంతో కృషి చేయాలి

**✻ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**నస్పూర్, జనవరి 02, ప్రభాతవార్త**

జిల్లా వార్షిక రుణ లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేలా బ్యాంకర్లు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎ.జి.ఎం. చేతన్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ప్రశాంత్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ సురేష్‌లతో కలిసి వివిధ బ్యాంకుల అధికారులతో రుణ లక్ష్య సాధనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మిగతా 2లో..

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**ఆసిఫాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:**

కాగజ్‌నగర్ మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కలెక్టర్ వెంకటేష్ దోత్రే ను కోరారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాగజ్‌నగర్ మున్సిపల్ కార్మికుల సమస్యలు తీర్చాలని వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కార్మికుల సమ్మె వల్ల పట్టణం చెత్తాచెదారంతో నిండిపోయిందని, అంటురోగాలు వ్యాపించే ప్రమాదం ఉందని, త్రాగునీటికి ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకవెళ్లి సమ్మెను విరమింపచేసేందుకు కృషి చేస్తామని, మిగతా 2లో..

## పోలీస్ కుటుంబాలకు అండగా నిలుస్తాం

**★ జిల్లా ఎస్పీ నితిక పంత్ ★ గుండెపోటుతో మరణించిన ఎఆర్ఎస్ఐ కుటుంబ సభ్యులకు రూ.99,800 కార్పస్ చెక్ అందజేత**



**కాగజ్‌నగర్ రూరల్, జనవరి 2 ప్రభాతవార్త**

పోలీస్ సిబ్బంది కుటుంబాల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చడంతో పాటు వారి కుటుంబాలకు అండగా ఉంటామని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితిక పంత్ అన్నారు. కొముురం భీం ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఎఆర్ఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్న కాగజ్‌నగర్ మండలంలోని కాగజ్‌నగర్ మండలం ఈస్గాం నజురుల్ నగర్‌కు చెందిన జగదీష్ చంద్రమండల్ గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో గుండెపోటుతో మరణించగా ఆయన సతీమణికి కార్పస్ ఫండ్, వీడో ఫండ్ మొత్తం 99,800 రూపాయల విలువచేసే చెక్కును శుక్రవారం జిల్లా ఎస్పీ జిల్లా పోలీస్ కార్యాలయంలో వారికి అందజేయడం అందజేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ ప్రస్తుత స్థితిగతులను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. వారి మిగతా 2లో..

## నోడల్ అధికారులు విధులను
# సమర్ధవంతంగా నిర్వహించాలి

**(మొదటిపేజీ తరువాయి)**

కార్యక్రమాలకు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, ఎన్నికల సిబ్బందికి ఎన్నికల నిర్వహణలో అవసరమైన వాహనాలు సమకూర్చేందుకు జిల్లా రవాణా అధికారి, ఎన్నికలలో అభ్యర్థుల ఖర్చులకు సంబంధించి జిల్లా ఉద్యానవన అధికారి అబ్దుల్ నదీమ్ నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఎన్నికల పరిశీలకులకు జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్, బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్ కు డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, మీడియా కమ్యూనికేషన్ కు జిల్లా పౌర సంబంధాల అధికారి సంపత్ కుమార్ నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని, ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతిరోజు నివేదికలు సమర్పించే నోడల్ అధికారులుగా మున్సిపల్ కమిషనర్లు వ్యవహరించాలని తెలిపారు. ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో 20 వార్డులు, కాగజ్ నగర్ మున్సిపల్ పరిధిలో 30 వార్డులకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ ప్రదేశాలు, పోలింగ్ కేంద్రాలను గుర్తించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ముసాయిదా ఓటరు జాబితా సవరణలో భాగంగా వార్డుకు సంబంధించిన ఓటరు అదే వార్డులో ఉండే విధంగా ఫోటో ఓటరు జాబితా రూపొందించాలని, ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం, స్వీకరణ కేంద్రాలను గుర్తించాలని, ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి అవసరమైన ఏర్పాట్లపై నివేదిక సమర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ జాస్తిన్ జోల్, నోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు గజానన్, రాజేందర్ ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కుటుంబాలకు అండగా నిలుస్తాం

**(మొదటిపేజీ తరువాయి)**

కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వపరంగా అందాల్సిన ఇతర బెనిఫిట్లను తక్షణమే అందజేసేవిధంగా చూస్తామని వారి కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ అడ్మిన్ వామన మూర్తి, డి.పి.ఓ బి.సూపరింటెండెంట్ రవి ,జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షులు విజయ శంకర్ రెడ్డి,పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**(మొదటిపేజీ తరువాయి)**

అదేవిధంగా వారి పెండింగ్ జీతాలు, ఈఎస్ఐ బకాయిలు చెల్లిస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చినట్లు మాజీ ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట బిఆర్ఎస్ ట్రేడ్ యూనియన్ విభాగం జిల్లా నాయకులు అంబాల ఓదెలు ఉన్నారు.

## రాష్ట్ర స్థాయిలో శభాష్ అనిపించుకుంటున్న షహబాజ్

**- నెట్‌బాల్‌లో ఉత్తమ ప్రతిభతో జాతీయ స్థాయికి ఎంపిక**

**- పట్టణ ఎస్.ఐ. చేతుల మీదుగా సన్మానం**

మందమర్రి, జనవరి 02, ప్రభాతవార్త

మందమర్రి పట్టణం పాత బస్టాండ్ ప్రాంతానికి చెందిన కృష్ణవేణి పాఠశాల 9వ తరగతికి చెందిన విద్యార్థి ఎస్.కె. షహబాజ్ (తండ్రి: షంషీర్) నెట్‌బాల్ క్రీడలో తన ప్రతిభతో రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు అందుకుంటున్నాడు. గత డిసెంబర్ 2025లో మంచిర్యాల జిల్లాస్థాయిలో నిర్వహించిన నెట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం వహించాడు. అనంతరం నల్గొండ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో తన క్రీడా సత్తాను చాటుకుని జాతీయ స్థాయికి ఎంపికై తెలంగాణకు గర్వకారణంగా నిలిచాడు. జనవరి 8, 2026 నుంచి రాజస్థాన్ రాష్ట్రం బర్మర్‌లో నిర్వహించనున్న 69వ జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరఫున షహబాజ్ పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా శుక్రవారం, కృష్ణవేణి పాఠశాలలో కరస్పాండెంట్ (ఫిజికల్ డైరెక్టర్) రామ్ వేణు, ప్రధానోపాధ్యాయులు గుణపతి, ఉపాధ్యాయులు, విద్యార్థుల కరతాళ ధ్వనుల మధ్య పట్టణ ఎస్సై ఎస్. రాజశేఖర్ చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ, ఆటలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి. చదువుతో పాటు క్రీడల్లో ముందుండే విద్యార్థులే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి అని సూచించారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ రామ్ వేణు మాట్లాడుతూ, మా పాఠశాలలో ఆది నుంచే చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ, విద్యార్థులను వారి ప్రతిభను బట్టి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేస్తున్నాం అన్నారు. షహబాజ్ మాట్లాడుతూ,నన్ను చదువుతో పాటు ఆటల వైపు ప్రోత్సహించిన డైరెక్టర్ సార్‌కు, నన్ను అన్ని విధాలా ఆదరిస్తున్న నా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, నా మిత్రులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.







# వార్త క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్, ఎస్పీ

నిర్మల్‌రూరల్, జనవరి 2, ప్రభాతవార్త:

ప్రభుత్వాలకు ప్రజలకు వారధిగా ఉంటూ అనునిత్యం వార్తలు సేకరిస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరే విధంగా అవగాహన కల్పిస్తూ ప్రజా సమస్యలను ప్రభుత్వానికి తెలిసే విధంగా శ్రమించి వార్తలు సేకరించి ప్రజల మన్ననలు పొందుతున్న వార్త దినపత్రిక యజమాన్యాన్ని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల, డిపిఆర్ఓలు అభినందించారు. శనివారం వేరు వేరుగా 2026 నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా విలేకరులు పాల్గొన్నారు.

## వార్షిక రుణ లక్ష్యాల సాధనకు
# సమన్వయంతో కృషి చేయాలి

**(మొదటిపేజీ తరువాయి)**

మంచిర్యాల జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్2025 వరకు పంట రుణాలకు 2 వేల 541 కోట్ల రూపాయలు లక్ష్యం కాగా 1 వేయి 45 కోట్ల రూపాయలు, వ్యవసాయ దీర్ఘకాలిక రుణాలకు గాను 922 కోట్ల రూపాయలకు గాను 323 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, వ్యవసాయ రంగానికి 4 వేల 322 కోట్ల రూపాయలు లక్ష్యం కాగా 1 వేయి 572 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు 1 వేయి 105 కోట్ల రూపాయలు లక్ష్యం కాగా 437 కోట్ల రూపాయలు, విద్యా రుణాలు 138 కోట్ల రూపాయలు లక్ష్యం 4.6 కోట్ల రూపాయలు, గృహనిర్మాణ రుణాల లక్ష్యం 269 కోట్ల రూపాయలకు గాను 34 కోట్ల రూపాయలు, ప్రాధాన్యత రంగాల క్రింద 5 వేల 936 కోట్ల రూపాయలకు గాను 2 వేల 81 కోట్ల రూపాయలు, ప్రాధాన్యేతర రంగాల క్రింద 1 వేయి 940 కోట్ల రూపాయలకు గాను 1 వేయి 256 కోట్ల రూపాయలు సాధించడం జరిగిందని తెలిపారు. ముద్ర రుణాల క్రింద 11 వేల 272 మందికి 125 కోట్ల రూపాయలు అందించడం జరిగిందని, 9 వేల 315 స్వయం సహాయక సంఘాలకు గాను 679 కోట్ల రూపాయలు లక్ష్యం కాగా 380 కోట్ల రూపాయలు సాధించడం జరిగిందని తెలిపారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం క్రింద 212 మంది లబ్ధిదారులకు 2.07 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ప్రధానమంత్రి జన్ ధన్ పథకం క్రింద 3 లక్షల 15 వేల 486 మందికి ఖాతాలు తెరవడం జరిగిందని, ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన పథకం క్రింద 1 లక్షా 24 వేల 389 మందికి, ప్రధానమంత్రి సురక్షా భీమా యోజనలో 3 లక్షల 28 వేల 275 మందికి, అటల్ పెన్షన్ యోజన పథకం క్రింద 39 వేల 20 మంది నమోదు చేసుకున్నారని తెలిపారు. మంచిర్యాల జిల్లాకు చెందిన 105 మందికి గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థల ద్వారా శిక్షణ అందించడం జరిగిందని తెలిపారు. కిసాన్ క్రెడిట్ కార్డు క్రింద చేపల పెంపకం కొరకు 9 మంది లబ్ధిదారులకు, పాడి పశువులకు గాను 96 మంది లబ్ధిదారులకు లబ్ధి చేకూర్చడం జరిగిందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల ఆధారంగా అభివృద్ధి చెందే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రాధాన్యత రంగాలలో రుణాల కొరకు వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలకు తెలిసే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. చిరు వ్యాపారాలు, విద్య, గృహ రుణాలను వినియోగించుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపన, అభివృద్ధిపై ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ప్రజలకు వివరించాలని తెలిపారు. షెడ్యూల్ తెగల మహిళలకు పట్టు పరిశ్రమ నిర్వహణపై శిక్షణ అందించి ఉపాధి పొందే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. వ్యవసాయ సాగుకు సంబంధించి రుణాలు పొందిన రైతులు సకాలంలో తిరిగి చెల్లించి అవసరమైన నూతన రుణాలు పొందేలా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రుణ ప్రణాళిక లక్ష్యాలను సాధించే విధంగా బ్యాంక్ అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, బ్యాంకుల మేనేజర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు, సాంస్కృతిక రంగాల అభివృద్ధికి పటిష్ట చర్యలు

**- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

ఆదిలాబాద్, జనవరి 02, ప్రభాతవార్త

విద్యార్థుల్లో క్రీడా, సాంస్కృతిక నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం విస్తృతంగా నిధులు వెచ్చించి ప్రోత్సహిస్తున్నదని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శుక్రవారం కలెక్టర్ సమావేశ మందిరంలో, బోథ్ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో పర్యాటక శాఖ స్పాన్సర్‌షిప్‌తో నిర్వహించనున్న క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా, సాంస్కృతిక ప్రతిభను వెలికితీయడం, ప్రోత్సహించడం లక్ష్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. అందులో భాగంగా బోథ్ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో నిర్వహించనున్న క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలకు రూ. 25 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. విద్యార్థులకు అవసరమైన క్రీడా దుస్తులు, షూస్, క్యాప్స్, టీమ్ లోగోలు సిద్ధం చేయాలని, కార్యక్రమ నిర్వహణ ప్రదేశంలో ఎల్.ఈ.డి ప్రొజెక్టర్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఈ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. పాల్గొనే విద్యార్థులకు నాణ్యమైన భోజన వసతి సౌకర్యాలు కల్పించాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మట్, డిప్యూటీ కలెక్టర్ వంశీ కృష్ణ, జిల్లా పర్యాటక శాఖ అధికారి రవి కుమార్, ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు సునీత కుమారి, రాజలింగం, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ మనోహర్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, డిడి అంబాజీ తదితర వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## రేపు మెగా ఉచిత వైద్య శిబిరం

**నేరడిగొండ, జనవరి 02, ప్రభాతవార్త**

నేరడిగొండ మండల చరిత్రలో తొలిసారిగా మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నేరడిగొండ సర్పంచ్ ఏలేటి నీలిమ-రవీందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ గోతి గులాబ్ సింగ్ సౌజన్యంతో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఆరోగ్య సర్జికల్ అండ్ క్యాన్సర్ హాస్పిటల్, జనని ।జునీ సెంటర్, నేత్ర ఆప్టికల్స్ సహకారంతో వివిధ విభాగాలకు చెందిన నిపుణ వైద్యులు సేవలందించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరం ద్వారా సాధారణ వైద్య పరీక్షలు, ప్రత్యేక పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. నేరడిగొండ మండలంలోని 32 గ్రామపంచాయతీలకు చెందిన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు, పటేల్‌లు, దేవారులు, కారోబారిలు, గ్రామ పెద్దలు, యువకులు తమ తమ గ్రామ ప్రజలకు ఈ సమాచారాన్ని వాట్సాప్ గ్రూపులు, వాట్సాప్ స్టేటస్‌లు, మైక్ ప్రకటనల ద్వారా తెలియజేసి ఉచిత వైద్య సేవలను వినియోగించుకునేలా సహకరించాలని కోరారు. ఈ మెగా ఉచిత వైద్య శిబిరం 2026 జనవరి 4న ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నేరడిగొండలోని జడ్పీఎస్ఎస్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

## గురుకుల ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

**సారంగాపూర్, జనవరి 02, ప్రభాతవార్త:**

5, 6, 9వ తరగతి గురుకుల ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని మండలంలోని జామ్ గురుకుల పాఠశాల సిబ్బంది గాది గోవర్ధన్ తెలిపారు. జామ్ గ్రామంలోని గ్రామపంచాయతీ వద్ద ఉమ్మడి గురుకుల ప్రవేశ పరీక్ష కోసం గ్రామ సర్పంచ్ కరిపే రవళి విలాస్, పంచాయతీ కార్యదర్శి నరేష్, ఉప సర్పంచ్ గంగయ్యలకు కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కరిపే రవళి విలాస్ మాట్లాడుతూ ప్రభుత్వం పేద పిల్లల కోసం గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసిందని, ఇందులో చేరడానికి ప్రవేశ పరీక్ష ఉంటుందని దానిని సకాలంలో అప్లై చేసుకుని గురుకులాలలో సీటు పొందాలని కోరారు. గురుకులాల్లో మంచి విద్యాబోధన ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్స్ ఆడెపు లక్ష్మీ మహేందర్, తోకల నరేష్, నలిమిల రాము, వెలిశాలి తిరుమలచారి, అల్లాడి నర్సయ్య, గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కేయూ డిగ్రీ ఇయర్ వైజ్ పరీక్ష ఫీజులకు ప్రత్యేక అనుమతి

**బెల్లంపల్లి, జనవరి 02, ప్రభాతవార్త**

కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గతంలో ఖఇయర్ వైజ్ డిగ్రీ౧౧ చదివి బ్యాక్లాగ్ సబ్జెక్టులు ఉన్న విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించుటకు ప్రత్యేక అనుమతి ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. గతంలో ఈ కళాశాలలో చదివి ఇయర్ వైజ్ పరీక్షలు రాసి బ్యాక్లాగ్ సబ్జెక్టులు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక్కో పేపర్‌కు రూ. 4000ల చొప్పున చెల్లించవలసి ఉంటుందని, ఈ మేరకు విశ్వవిద్యాలయ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారని వివరించారు. సంబంధిత దరఖాస్తు ఫారాలు కళాశాలలో అందిస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి దరఖాస్తు నింపి దానితో పాటు సంబంధిత వివిధ పత్రాలు జత చేసి తిరిగి కళాశాలలోనే అందజేయవలసి ఉంటుందని పేర్కొన్నారు. ఇయర్ వైజ్ బ్యాక్లాగ్ సబ్జెక్టులు క్లియర్ చేసుకోవడానికి ఇది ఒక మంచి అవకాశం అని ప్రిన్సిపాల్ విద్యార్థులకు సూచించారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన జాన్సన్ నాయక్

**సిరికొండ, జనవరి 2, ప్రభాతవార్త:**

సిరికొండ మండలం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ ఒరగంటి పెంటన్న తల్లి, రిమ్మ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ పెందూర్ అమృతరావ్ తల్లి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఖానాపూర్ టిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి జాన్సన్ నాయక్ వారి నివాసాలకు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. ఆయన వెంట మండలానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జాన్సన్ నాయక్

# విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య

### ★ కలెక్టర్ కుమార్ దీపక్

**వేమనపల్లి, జనవరి 2, ప్రభాతవార్త**



ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థినీ, విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని వేమనపల్లి మండలం నీల్వాయిలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులు, వంటశాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి కుమారస్వామి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన త్రాగునీరు, విద్యుత్, విద్యార్థినీ, విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర సదుపాయాలతో పాటు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం, నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి వంటశాల, భోజనశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆహారం నాణ్యతలో ప్రమాణాలు పాటించాలని, విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలు కల్పిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి మయూరి, ఎహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు మాధవ్,స్థానిక సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేదలకు, వితంతువులకు దుప్పట్ల పంపిణీ

### - హెల్పింగ్ హాండ్స్ ట్రస్ట్ అధ్యక్షులు బొడ్డు రవి జోసెఫ్

**లక్షెట్టిపేట, జనవరి 02, ప్రభాతవార్త**

మండలంలోని మిట్టపల్లి గ్రామంలోని పేదలకు, వితంతువులకు 40 చద్దర్లు హెల్పింగ్ హాండ్స్ ట్రస్ట్ అధ్యక్షులు బొడ్డు రవి జోసెఫ్ నాయకులతో కలిసి పంపిణీ చేశారు .ఈ సందర్భంగా హైదరాబాదులో ఉన్న ఎం.కె థియేడర్ పద్మిని వారి కుటుంబము సహాయం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బొడ్డు రవిజోసఫ్ మాట్లాడుతూ.. చలి తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా వారిని గుర్తించి చలి నుంచి రక్షించాలని ఉద్దేశంతో పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో విజన్ టు తౌసెండ్ తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ సుందిళ్ల సందీప్, అంబేద్కర్ యువజన సంఘం టౌన్ ప్రెసిడెంట్ తోగరు రాజు, బైరం లింగన్న, చాతరాసి శేఖర్, మేరీ పుష్ప, జాన్ మార్క్, చరణ్ తేజ, వరలక్ష్మి, మల్లిక, రాజేశ్వరి, సుమలత, తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాలలో సమస్యలను పరిష్కరిస్తాం

**లక్షెట్టిపేట, జనవరి 02, ప్రభాతవార్త**

పాఠశాలలో సమస్యలను పరిష్కరిస్తామని లక్షెట్టిపేట మండలం దౌడేపల్లి సర్పంచ్ తీర్థాల వెంకటేశ్ అన్నారు. శుక్రవారం గ్రామంలోని జడ్పీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తానని ఆమె ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నర్మదా, శిరీష ఉపాధ్యాయులు తిరుపతి, సుభాష్, లవకుమార్ పాల్గొన్నారు.

## శాంతి భద్రతల రక్షణకు చర్యలు: ఎస్సై

**రామకృష్ణాపూర్, జనవరి 02, ప్రభాతవార్త**

పట్టణంలో శాంతి భద్రతలు రక్షణకు చర్యలు చేపట్టినట్లు ఎస్.ఐ భూమేష్ అన్నారు. శుక్రవారం క్యాతన్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కలవల శంకర్ నేతృత్వంలో సబ్ ఇన్స్పెక్టర్ భూమేష్‌ను కలిసి పూలగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శాంతి భద్రత విషయంలో ఉపేక్షించేది లేదని, చట్టం ముందు అందరూ సమానులేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాతన్‌పల్లి ప్రెస్ క్లబ్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిల్ల శ్రీనివాస్, ముఖ్య సలహాదారు కనుకుంట్ల సుభాష్, కోశాధికారి పరికిపళ్ళ రాజు, ఉపాధ్యక్షులు రామిడి సాయి సృజన్,ప్రచార కార్యదర్శి ఎలకటూరి నరేష్ పాల్గొన్నారు.




## ముసయిదా ఓటరు జాబితా పై అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయండి

### - కమిషనర్ గద్దె రాజు

**రామకృష్ణాపూర్, జనవరి 02, ప్రభాతవార్త**

ముసాయిదా ఓటరు జాబితా పై ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే లిఖిత పూర్వకంగా మున్సిపాలిటీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ గద్దె రాజు కోరారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశానుసారం శుక్రవారం ముసయిదా ఓటరు జాబితాను విడుదల చేసి, ప్రజల సౌకర్యార్థం నోటీస్ బోర్డులో ఉంచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 5వరకు అభ్యంతరాలు స్వీకరించేందుకు కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మోచక ఫిర్యాధులకు తావు లేదని స్పష్టం చేశారు. అభ్యంతరాలు వస్తే 9వ తేదీ వరకు విచారణ చేసి ప్రభుత్వం దృష్టి కి పంపిస్తామని తెలిపారు.అనంతరం ఎన్నికల కమిషన్ తుది జాబితా విడుదల చేస్తుందని తెలిపారు.



# నార్నూర్ అభివృద్ధికి నిధులు సద్వినియోగం చేయాలి

**- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్, జనవరి 02, ప్రభాతవార్త:**

నీతి ఆయోగ్ డేటా ర్యాంకింగ్స్‌లో దేశవ్యాప్తంగా 4వ స్థానం, దక్షిణ భారతదేశంలో 1వ స్థానం సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచిన నార్నూర్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1.5 కోట్ల రివార్డ్ గ్రాంట్‌ను సమర్థవంతంగా వినియోగించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. నిధుల వినియోగంపై శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నార్నూర్ సాధించిన ఈ విజయం మొత్తం జిల్లాకే గర్వకారణమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను ప్రజల మౌలిక అవసరాలను తీర్చేలా, తక్షణ ప్రయోజనం కలిగించే అభివృద్ధి పనులకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తాత్కాలిక పనులకు కాకుండా గ్రామానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూర్చే అభివృద్ధి పనులను ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. విద్య, ఆరోగ్యం, తాగునీటి సరఫరా వంటి రంగాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. చేపట్టే ప్రతి అభివృద్ధి పనిలో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని, నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత ఉండాలని స్పష్టం చేశారు.

ఈ నిధులతో చేపట్టే ప్రతి పని ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడేలా ఉండాలని అన్నారు. అన్ని శాఖల నుండి వచ్చిన ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించి, ఒక సమగ్ర ప్రాజెక్ట్ ప్రణాళికను వెంటనే సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతిపాదనలను ప్రభుత్వ ఆమోదం కోసం పంపించనున్నట్లు తెలిపారు. ఆమోదం లభించిన వెంటనే పనులను ప్రారంభించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మట్, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డిప్యూటీ కలెక్టర్ వంశీకృష్ణ, వివిధ శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా



కబడ్డీ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మెస్రం జంగుబాపు

## హర్కాయి గ్రామంలో కబడ్డీ టోర్నమెంట్

**బజార్‌హత్నూర్, జనవరి 02, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని హర్కాయి గ్రామంలో కబడ్డీ టోర్నమెంట్ హట్టహసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ జడ్పిటిసి అభ్యర్థి మెస్రం జంగుబాపును గ్రామ సర్పంచ్, యువకులు, గ్రామ పెద్దలు ఆహ్వానించారు. టోర్నమెంట్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జడ్పిటిసి అభ్యర్థి మెస్రం జంగుబాపు మాట్లాడుతూ క్రీడలు అనేవి మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని, ఒక వ్యక్తిలో ఉన్న సృజనాత్మకతను గుర్తింపు తీస్తాయని అన్నారు. ఆదివాసి యువత క్రీడలతో పాటు విద్యకు కూడా మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఆదివాసి గ్రామాలకు ఎటువంటి సమస్య ఉన్న నేను ముందుండి, పరిష్కారానికి కృషి చేస్తానని గ్రామ యువతకు హామీ ఇస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హార్కాయ్ సర్పంచ్ గెడం సావిత్రబాయి అశోక్, ధరంపూరి సర్పంచ్ అర్క యాదవ్‌రావు, ఉపసర్పంచ్ సోంపాల్, మాజీ ఎంపిటిసి నిస్తే కైలాస్, కోసం శేఖర్, మల్లెపూల విజయ్, నారాయణ, గ్రామ పెద్దలు, యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు,విద్యార్థులు

## రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ

**బెజ్జూర్,జనవరి 2, ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండల కేంద్రంలో శుక్రవారం బెజ్జూర్ పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా అతివేగం ప్రమాదకరమని,మద్యం తాగి వాహనాలు నడపకూడదని అన్నారు.మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని,హెల్మెట్ లేకుండా బైకులు నడిపితే ప్రమాదాల తీవ్రత అధికంగా ఉంటుందని తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానిపై కేసులు నమోదవుతాయని ఎస్ఐ సర్తాజ్ పాష తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

**ఆసిఫాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:**

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల దృష్ట్యా, ప్రశాంత వాతావరణ పరిస్థితులను కొనసాగించడానికి జనవరి 02 నుండి జనవరి 31 వరకు జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ నితికా పంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 పోలీస్ యాక్ట్1861 అమల్లో ఉన్నందున జిల్లాలో ఎస్పీ, డిఎస్పి లేదా ఆపై పోలీస్ ఉన్నతాధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, బహిరంగ సభలు, తదితర ప్రజలు గుమికూడి ఉండేవిధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అదేవిధంగా నిషేధిత ఆయుధాలు, దురుద్దేశంతో నేరాలకు ఉసి కోలిపే ఎటువంటి ఆయుధాలు కల్గిఉండరాదన్నారు. జారీచేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు.

## రేచినిలో మహిళపై వీధి కుక్క దాడి

**తాండూర్, జనవరి 2, ప్రభాతవార్త :**



మండలంలోని రేచిని గ్రామంలోని పోచమ్మవాడకు చెందిన మామిడి రాజేశ్వరి అనే మహిళ పై శుక్రవారం వీధి కుక్కలు దాడి చేశాయి. ఉదయం ఇంటి ముందు రాజేశ్వరి ముగ్గు వేస్తున్న సమయంలో వీధి కుక్కల దాడి తీసి గాయపరిచాయి. దీంతో కుటుంబ సభ్యులు మహిళను చికిత్స నిమిత్తం108 వాహనంలో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీధి కుక్కలను బారి నుండి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి దేవస్థానం పదో వార్షికోత్సవ వేడుకలు

**ఉట్నూర్, జనవరి 2, ప్రభాతవార్త :**

శ్రీ హరిహర సుత అయ్యప్ప స్వామి దేవస్థానం పదో వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఉట్నూర్ వినాయకచౌక్ సమీపంలోని హనుమాన్ ఆలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలు గురు స్వామి చక్రవర్తుల పురుషోత్తమా చారి, ఆలయ పూజారి దీపక్ దూబే వారి ఆధ్వర్యంలో అయ్యప్ప అభిషేకం నవగ్రహ పూజ,యజ్ఞము, రాత్రి పదినట్టబడి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షులు రాథోడ్ భీమ్ రావు, నాగభూషణ్,తిరుపతిరెడ్డి, నంది రెడ్డి, మోర శ్రీనివాస్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు గుగ్లావత్ శ్రీరామ్ నాయక్, గ్రామ ప్రముఖులు అయ్యప్ప దీక్ష స్వాములు తదితరులు పాల్గొన్నారు



పూజలు చేస్తున్న అయ్యప్ప స్వాములు

## ముగిసిన కబడ్డీ పోటీలు

**లింగాపూర్, జనవరి 2, ప్రభాతవార్త**

లింగాపూర్ జగదాంబ దేవి జాతరలో జాతర కమిటీ సభ్యులు ఆటల పోటీలను గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలనె ఉద్దేశంతో వాలీబాల్. కబడ్డీ పోటీలను నిర్వహించారు. గత మూడు రోజులు గా నిర్వహించిన కబడ్డీ పోటీలు.మొదటి బహుమతి విజేతగా మారుగూడా కబడ్డీ జట్టు గెలవగ. రెండవ బహుమతి రేంగన్ ఘాట్ కబడ్డీ జట్టు గెలుపొందారు.క్రీడాకారులను లింగాపూర్ ఎస్సై గంగన్న.గ్రామ నాయక్ కిరణ్ కుమార్.లింగాపూర్ సర్పంచ్ జాదవ్ రాజశేఖర్. గ్రామపటేల్,కబడి ఏ్పైర్ రాథోడ్ వినోద్, మనోజ్, గోకుల్, జాటోత్ రాహుల్, సమస్త జాతర కమిటీ సభ్యులు, మండల నాయకులు గ్రామనాయకులు కలసి రెండు కబడ్డీ జట్టులకు బహుమతులు ప్రదానం చేశారు.



గెలుపొందిన కబడ్డీ జట్లతో జాతర కమిటీ సభ్యులు

## డిగ్రీ పరీక్షలు పాస్ కావడానికి చివరి అవకాశం

**నేరడిగొండ, జనవరి 02, ప్రభాతవార్త:**

గతంలో 2016కు ముందు ఇయర్ వైస్‌లో జాయిన్ అయిన విద్యార్థుల బ్యాక్లాగ్ డిగ్రీ పరీక్షలు రాయడానికి కాకతీయ యూనివర్సిటీ చివరి అవకాశాన్ని ఇవ్వడం జరిగిందని ఈ చివరి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సాయి చైతన్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సామ రాజకిరణ్ రెడ్డి ఒక ప్రకటన తెలిపారు. ఇంకా ఏమైనా డౌట్స్ ఉంటే కళాశాలలో లేదా 9515394905, 9014443055, 901444501 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.



## నేడు విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన

**ఇచ్చోడ, జనవరి 2, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని బీపీఆర్ పాఠశాలలో శనివారం రోడ్డు భద్రతపై భారీ అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంఈఓ బిక్కు తెలిపారు. వివిధ పాఠశాలలకు చెందిన 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నాలుగు ప్రధాన అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు అదనపు కలెక్టర్, డీఈఓ, రవాణా శాఖ అధికారులు హాజరుకానున్నారన్నారు. విద్యార్థుల్లో ట్రాఫిక్ నిబంధనలపై చైతన్యం తెచ్చేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## దుప్పట్లు పంపిణీ

**ఉట్నూర్, జనవరి 2, ప్రభాత వార్త:**



మండలంలోని లక్కారం గ్రామంలో కొత్తపల్లి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత దుప్పట్ల పంపిణీ చేశారు. శుక్రవారం సొసైటీ ఛైర్మెన్ కొత్తపల్లి మహేందర్ మాట్లాడుతూ సమాజంలో వృద్ధులకు సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. చలికాలంలో వృద్ధులు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మర్సుకొల తిరుపతి, జాదవ్ జగదీష్,జైనూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తొడసం రాధాబాయి సొసైటీ సభ్యులు నితీష్ కుమార్, అత్రం లక్ష్మణ్,బలేరావు, అంబదాష్, అనంద్,సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



## కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాభివృద్ధి

**ఇచ్చోడ, జనవరి 2, ప్రభాతవార్త:**

మండలంలోని జామిడి గ్రామస్థులు, బీజేపీ నాయకులు ఆదిలాబాద్ ఎంపినీ ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూల బొకేతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామ అభివృద్ధి సమస్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులను కేటాయిస్తుంది వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన మాజీ ఎంపీ, సర్పంచ్

**ఇచ్చోడ, జనవరి 2, ప్రభాతవార్త:**



మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు, ఇచ్చోడ సర్పంచ్ జలై జాకు శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజార్షి షాను కలిసి నూతన సంవస్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువా, బొకేలు కాకుండ నిరుపేద విద్యార్థులకు ఉపయోగపడేల నోట్‌బుక్‌లు, పెన్నులు అందజేశారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కేపెల్లి లక్ష్మణ్ ఉన్నారు.

## పార్ట్ టైం స్లీపర్స్ వేతనాలు చెల్లించాలి

**తాండూర్, ప్రభాతవార్త :**



మంచిర్యాల జిల్లాలోని గ్రంథాలయాల్లో పనిచేస్తున్న పార్ట్ టైం స్వీపర్స్ వేతనాలు వెంటనే చెల్లించాలని పార్ట్ టైం స్వీపర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి చెరుకుపల్లి స్వామి డిమాండ్ చేశారు. గ్రంథాలయ కార్యదర్శి, అధికారులు ఎవరు అందుబాటులో లేకపోవడంతో శుక్రవారం అవుట్ సోర్సింగ్ పార్ట్ టైం హెల్పర్ కి సంపత్ కుమార్ కు యూనియన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలలుగా వేతనాలు సకాలంలో రాక అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరిగిన తమ వేతనాల మాత్రం పెరగడం లేదన్నారు. అరకొర వేతనం కూడా సకాలంలో ఇవ్వకుండా వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు తమ వేతనాలు పెంచి సకాలంలో వేతనాలు చెల్లించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్ట్ టైం స్లిప్పర్స్ సుజాత, మధుకర్, సంతోష్, సత్యనారాయణ, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో ఐఎన్‌టీయూసీ నేతల పర్యటన

**- కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్**

**- సానుకూలంగా స్పందించిన యాజమాన్యం**

**నస్పూర్, జనవరి 02, ప్రభాతవార్త**

ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బి. జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు శుక్రవారం శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ నాయకులు సందర్శించారు. గని పిట్ కార్యదర్శి ఓరం జగన్ నేతృత్వంలో సంఘం సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు, ఉపాధ్యక్షులు గరిగ స్వామి, పి. తిరుపతి రాజు ఎస్సార్పీ ఓసీపీని సందర్శించారు. మధ్యాహ్నం రెండవ షిఫ్ట్ సమయంలో నాయకులు నేరుగా ఎలక్ట్రికల్ సూపర్వైజర్లు, టెక్నీషియన్లు, ఈపీ ఆపరేటర్లు, ఇతర కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను నాయకులు గుర్తించారు. ఈపీ ఆపరేటర్లు, ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్లు, హెల్పర్ల కొరత వల్ల ఉన్న సిబ్బందిపై పనిభారం పెరుగుతోందని, దీనివల్ల భద్రత మరియు ఉత్పత్తి దెబ్బతింటున్నాయని కార్మికులు వాపోయారు. అలాగే ఎనిమిది గంటల నిరంతర పని వల్ల కలిగే అలసటను దృష్టిలో ఉంచుకుని లంచ్ అవర్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై నాయకులు యాజమాన్యంతో చర్చించగా, సానుకూల చర్యలు తీసుకుంటామని హామీ లభించింది. ఈ కార్యక్రమంలో షిఫ్ట్ ప్రతినిధులు, టెక్నీషియన్లు, ఈపీ ఆపరేటర్లు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### సావిత్రిబాయి పూలే జయంతిని

# ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని మోకాళ్లపై నిరసన

**మంచిర్యాల, జనవరి 2, ప్రభాతవార్త**



మోకాళ్ళపై నిరసన తెలుపుతున్న సభ్యులు

మంచిర్యాల పట్టణంలోని ఐబి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం కేంద్ర ప్రభుత్వం సావిత్రిబాయి పూలే జయంతిని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మోకాళ్లపై నిలుచుని నిరసన వ్యక్తం చేస్తూ నాయకులు మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు అయిన సావిత్రిబాయి పూలేను కేంద్ర ప్రభుత్వం గుర్తించకపోవడం అంటే ఇది బీసీ మహిళల పట్ల వివక్షగా భావిస్తున్నాం .మహిళలు వంటింటికే పరిమితమైన రోజుల్లో మూఢనమ్మకాలు రాజ్యమేలుతున్న కాలంలోనే మహిళలకు చదివేంటి అనే కాలంలోనే చదువుకొని ఉపాధ్యాయ వృత్తిని చేతబూని అణగారిన కులాలకు చదువు ప్రాముఖ్యతను చెప్పి అనేక పాఠశాలలను ప్రారంభించి చదువు చెప్పిన ధీరవనితకు కేంద్ర ప్రభుత్వం సరైన గుర్తింపు ఇవ్వాలంటే సావిత్రిబాయి జయంతిని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలి అలాగే భారతరత్న ప్రకటించి కేంద్ర సెక్రటేరియట్‌లో సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని ప్రతిష్టించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నాంలేనిపక్షంలో సావిత్రిబాయి పూలేకు భారతరత్న సాధించేవరకు అదేవిధంగా కేంద్ర సెక్రటేరియట్ లో విగ్రహం ప్రతిష్టించేంతవరకు సావిత్రిబాయి పూలే జయంతిని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించేంత వరకు బీసీ మహిళలను చైతన్యం చేసి ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి శాఖ పోరి భీమ్సేన్, రాష్ట్ర బీసీ నాయకులు గజెల్లి వెంకటయ్య, చంద్రగిరి చంద్రమోళి, రాజన్న చారి, చెలిమల అంజయ్య, కీర్తి బిక్షపతి, అంకం సతీష్, వేముల అశోక్, భీం రావ్ తదితరులు పాల్గొన్నారు.

## కిరణ్ మోడర్న్ పాఠశాలలో రుచుల పండుగ

**పెంచికల్ పేట్, జనవరి 2, ప్రభాతవార్త :**



పెంచికల్ పేట్ మండలం ఎల్కపల్లి గ్రామంలోని కిరణ్ మోడర్న్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కరస్పాండెంట్ వేముల సాయికిరణ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫుడ్ ఫెస్టివల్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి రమేష్ బాబు, సర్పంచ్ భక్తు రాంచందర్, ఎస్సై అనిల్ కుమార్, సీఆర్పీ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సాయి కిరణ్ మాట్లాడుతూ ఇంట్లో వండిన ఆహార పదార్థాల ప్రాముఖ్యతను, ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లను విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఫుడ్ ఫెస్టివల్ ను నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన వంటకాలను అతిథులు పరిశీలించి అభినందించారు. కార్యక్రమం అనంతరం అతిథులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వీధి కుక్కలు బెడదను అరికట్టాలి

**తాండూర్, జనవరి 2, ప్రభాతవార్త :**



మండలం రేచిని గ్రామంలో వీధి కుక్కల బెడదను అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు రవితేజ కోరారు. స్థానిక ఇంచార్జ్ ఎంపీడీఓ వేణుగోపాలరావుకు శుక్రవారం ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి కుక్కల సంచారం వలన గ్రామస్తులు బయటకు వెళ్లాలంటేనే భయ పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముగ్గురు మహిళల పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వీధి కుక్కలు బెడతను అరికట్టుటకు తగిన చర్యలు తీసుకుంటానని ఇన్చార్జ్ ఎంపీడీవో హామీ ఇచ్చారు.

## టీఎస్ యుటిఎఫ్ సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్ డైరీ ఆవిష్కరణ

**సిర్పూర్ (టి), జనవరి 2, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో శుక్రవారం రోజున స్థానికమండల విద్యావనరుల కేంద్రం ఆవరణలో మండల విద్యాధికారి చింత సదాశివుడు చేతుల మీదుగా 2026 సంవత్సర డైరీ,కాలమానినీ, అధ్యాపకదర్శిని,వాల్ స్టిక్కర్లను ఆవిష్కరించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ నూతన సంవత్సరం అందరికీ మంచి జరగాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని అన్నారు. జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతి కుమారి గారు మాట్లాడుతూ డైరీలో ఉపాధ్యాయ సర్వీసు నిబంధనలు మరియు ప్రభుత్వ జీవోల గురించి ఈ హ్యాండ్‌బుక్‌లో వివరణాత్మక విద్యా సంబంధిత పూర్తి సమాచారం ఉంటుందని అలాగే రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్లో ఉన్న డి ఏ లను వెంటనేవిడుదల చేయాలని నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణ తక్షణమే పి ఆర్ సి రిపోర్ట్ తెప్పించుకొని ఫిట్మెంట్ ప్రకటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దీ.హరీష్,ఉపాధ్యక్షుడు రీ.హరీష్ కుమార్, మండల నాయకులు వంశీ,సాయి, సంగదీప్, ఉపేందర్, రజిత,సెలెష్టినా,సబీనా,ఐశ్వర్య,రాము,తరుణ్, యుగంధర్, సంజయ్, మునిందర్,గోపాల్,రమణ, ప్రకాష్,పవన్,రమేష్ పాల్గొన్నారు.




## రోడ్డు భద్రత మాసోత్సవాల అవగాహన సదస్సు

**బజార్‌హత్నూర్, జనవరి 02, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రోడ్డు భద్రత మాసోత్సవాల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ అల్లే శ్రీనివాస్, స్థానిక ఎస్సై సంజయ్ కుమార్ మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు మత్తు పానియాలు సేవించ రాదని, హెల్మెట్ ధరించి బైకులు నడపాలని, ట్రాఫిక్ నిబంధనలను ప్రతీ ఒక్కరూ పాటించాలని పేర్కొన్నారు. సీటు బెల్టును ధరించి మీ యొక్క ప్రాణాలకు రక్షణ కల్పించు కోవాలని అన్నారు. యాక్సిడెంట్లు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఒక యాక్సిడెంట్ వలన ప్రమాదాలకు గురైతే వారి కుటుంబాలు రోడ్డున పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐలు శ్రీనివాస్, ప్రదీప్ కుమార్, ఎంఈఓ రాంకిషన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జే భూమన్న, ఉపాధ్యాయ బృందం, వైద్యశాఖ సిబ్బంది హెచ్ఈఓ సూర్యప్రకాశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## చేడ్వాయిలో గ్రామ సభ సమావేశం

**పెంచికల్ పేట్, జనవరి 2, ప్రభాతవార్త :**

చేడ్వాయి గ్రామపంచాయతీ సర్పంచ్ చౌదరి శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుద్ధం, తాగునీటి సరఫరా, రహదారుల మరమ్మత్తులు తదితర అంశాలపై సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, కార్యదర్శి గ్రామస్తులు పాల్గొన్నారు.



సమావేశంలో పాలకవర్గం, ప్రజలు

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

**ఆసిఫాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ లోని రాష్ట్ర ఎన్నికల కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల అదనపు కలెక్టర్లు, రాజస్వ మండల అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి మాట్లాడుతూ రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కొరకు ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి పూర్తి ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఓటర్ల జాబితా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా స్పష్టంగా రూపొందించాలని, పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ భవన సముదాయంలోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ గజానన్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపాలిటీలకు ఎన్నికల నిర్వహణ కొరకు ఏర్పాట్లు చేపడతామని తెలిపారు. ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో 20 వార్డులు, కాగజ్ నగర్ మున్సిపల్ పరిధిలో 30 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపడతామని, ఇందులో భాగంగా ఆర్ఓలు, ఏఆర్ఓలను నియమించడం జరిగిందని, స్టాటిస్టిక్, ఫ్లయింగ్ సర్వేయలెన్స్ బృందాలు, పోలింగ్ సిబ్బందిని నియమించడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ సిబ్బంది అదనంగా 20 శాతం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాల ముద్రణతో పాటు నోడల్ అధికారులను నియమించి వారికి కేటాయించిన విధులపై దిశ నిర్దేశం చేయడం జరిగిందని తెలిపారు. ఈ నెల 5వ తేదీన రాజస్వ మండల అధికారి స్థాయిలో, 6వ తేదీన కలెక్టర్ అధ్యక్షతన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ నెల 1వ తేదీన అభ్యంతరాల కొరకు ఫోటో ఓటరు జాబితాను ప్రకటించడం జరిగిందని, అభ్యంతరాలను, దరఖాస్తులను పరిశీలించి ఈ నెల 10వ తేదీన తుది జాబితాను ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలలో వసతుల కల్పన, సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేపడతామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికలను అధికారుల సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి కిరణ్, ఎన్నికల విభాగం అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

## కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన అధికారులు

**నిర్మల్‌రూరల్, జనవరి 2, ప్రభాతవార్త:**

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు నూతన సంవత్సరం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్లోని తన చాంబర్లో పలువురు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ కు నోటు పుస్తకాలు, పూల మొక్కలు, పుష్ప గుచ్ఛాలను అందించారు. కేకులు కట్ చేశారు. పలు శాఖల, ఉద్యోగ సంఘాలకు చెందిన డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులకు, ఉద్యోగులకు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అధికారులంతా ఉత్సాహంతో పని చేస్తూ, జిల్లాను అన్ని రంగాలలో ముందు వరుసలో ఉంచాలని పేర్కొన్నారు. కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, టిఎన్జీవో సంఘ నాయకులు, పలువురు జిల్లా మీడియా ప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

**నార్నూర్, జనవరి 02, ప్రభాతవార్త**

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో మండలంలోని షేకుగూడ గ్రామంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా గ్రామస్థులు వాలింటర్లకు సన్మానించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమంతో ఆకట్టుకున్నారు. వారం రోజుల పాటు చేపట్టిన కార్యక్రమాల గురించి ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బాలాజీ కాంబ్లె రిపోర్ట్ సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ భీంబాయి, ఉప సర్పంచ్ జాదవ్ రాజేశ్వర్, ప్రిన్సిపల్ వెంకట కేశవులు, లెక్చరర్లు వెంకటరమణ, అజయ్, మల్కు పటేల్, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్ని యూనియన్లకు సమాన హోదా కల్పించాలి

**- ఆర్.కె న్యూ టెక్ గని మేనేజర్‌కు హెచ్ఎంఎస్, తెలంగాణ జాగృతి వినతి**

**నస్పూర్, జనవరి 02, ప్రభాతవార్త**

సింగరేణి వ్యాప్తంగా గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాల కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో, అన్ని రిజిస్టర్డ్ సంఘాలకు సమాన హోదా కల్పించాలని హెచ్ఎంఎస్, తెలంగాణ జాగృతి నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్.కె న్యూ టెక్ గని మేనేజర్ కూరపాటి శ్రీనివాస్ కు ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎంఎస్ నాయకులు తులా అనిల్ కుమార్ మాట్లాడుతూ, 2023 డిసెంబర్ 27న జరిగిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల గడువు 2025 డిసెంబర్ 27తో ముగిసిందని గుర్తుచేశారు. సెంట్రల్ లేబర్ కమిషనర్ ఆదేశాల ప్రకారం గుర్తింపు సంఘం కాలపరిమితి రెండేళ్లు మాత్రమేనని, ఆ గడువు ముగిసిన వెంటనే ప్రస్తుత హోదా రద్దవుతుందని స్పష్టం చేశారు. కొత్త ఎన్నికలు నిర్వహించే వరకు అన్ని రిజిస్టర్డ్ కార్మిక సంఘాలను సమానంగా చూడాలని, మైన్స్ కమిటీ, పిట్ సేఫ్టీ కమిటీ సమావేశాలకు అన్ని సంఘాల ప్రతినిధులను ఆహ్వానించాలని, కార్మికుల సమస్యలపై నిర్వహించే అన్ని అధికారిక చర్చల్లో అన్ని సంఘాలకు భాగస్వామ్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ నాయకులు సురేందర్, అనిల్ అడ్లూరి, సంపత్, తెలంగాణ జాగృతి నాయకులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



ఆర్.కె న్యూ టెక్ గని మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

## రేపు నస్పూర్ పద్మశాలి సంఘం, మార్కండేయ ఆలయ నూతన కమిటీల ఎన్నిక

**- జిల్లా నేతల సమక్షంలో నిర్వహణ.. విజయవంతం చేయాలని పిలుపు**

**నస్పూర్, జనవరి 02, ప్రభాతవార్త**

నస్పూర్ మండల పద్మశాలి సంఘం, శ్రీ లక్ష్మి గణపతి శివ మార్కండేయ దుర్గ మాత దేవాలయ నూతన కమిటీల ఎన్నిక ఈ నెల 4వ తేదీన ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎన్నికల బాధ్యులు కుందారపు రమేష్, చిలువేరు శరవందం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు గాదాసు బాపు, గౌరవ అధ్యక్షులు గడ్డం సుధాకర్, మంచిర్యాల పట్టణ అధ్యక్షులు రాం సత్తయ్య, మందమర్రి పట్టణ అధ్యక్షులు చిలగాని సుదర్శన్ ముఖ్య అతిథులుగా హాజరై, ఈ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. దేవాలయ అభివృద్ధి, సంఘం పురోగతిని కాంక్షించే ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.



## ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ ప్రోగ్రాం

**సిర్పూర్(టి), జనవరి 2 ప్రభాతవార్త:**

మండలంలోని లోన వెల్లి పీహెచ్సీ లో శుక్రవారం రోజున ప్రధానమంత్రి టీవీ ముక్త్ భారత్ అభియాన్ ఆయుష్మాన్ ఆరోగ్యంఅనే పథకంలోటీబీ క్షయ వ్యాధి అనుమానితులకు డాక్టర్ నవత ఆధ్వర్యంలో ఎక్రేలు స్క్రీనింగ్ చేశారు. లోన వెల్లి పీహెచ్సీ కేంద్రంలో 98 మందికి పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా టిబి కోఆర్డినేటర్ పవన్ సూపర్వైజర్ సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కేడంసతీష్, ఏఎన్ఎం పద్మావతి, సావిత్రి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## సెల్ టవర్ ఏర్పాటు చేయొద్దు

**ఆసిఫాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:**

ఆసిఫాబాద్ పట్టణలోని బ్రాహ్మణవాడలో ప్రైవేటు సంస్థకు చెందిన సెల్ టవర్ ఏర్పాటును నిలిపివేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. సెల్ టవర్ నిర్మాణ పనులు నిలిపివేయాలని కోరుతూ శుక్రవారం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ జనావాసాల మధ్య టవర్ నిర్మిస్తే రేడియేషన్ కారణంగా కాలనీవాసులు అనారోగ్యం బారినపడే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నగరపాలక సంస్థ అనుమతులను రద్దు చేయాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న ఈ నిర్మాణాన్ని అడ్డుకోవాలని కలెక్టర్ ను కోరినట్లు తెలిపారు. దీనికి స్పందించిన కలెక్టర్ విచారణ చేపట్టి చర్యలు తీసుకొంటామని వివరించినట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో వైరాగడే ప్రతాప్, సుగుణాకర్, శ్రీనివాసరావు, పరండే సాయి, అనంత్, నిమ్మ కంటి కీర్తి, మసాదే సువర్ణ, శిల్పా, పద్మ, జయంతి, గాయత్రి కాలనీవాసులు పాల్గొన్నారు.





బోర్వెల్‌కు భూమి పూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## పోచమ్మ ఆలయానికి మౌలిక వసతులు

### - గోంట్లపేటలో బోర్వెల్‌కు భూమి పూజ

**పెంచికల్ పేట్, జనవరి 2, ప్రభాతవార్త :**

పెంచికల్ పేట్ మండలం గోంట్లపేట గ్రామ దేవత పోచమ్మ తల్లి ఆలయానికి మౌలిక వసతుల కల్పనలో ముందడుగు పడింది. ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ సహకారంతో ఆలయ ప్రాంగణంలో బోర్వెల్ మంజూరు అయింది. ఎస్డీఎఫ్ ప్రత్యేక అభివృద్ధి విధుల నుంచి రూ. 1 లక్ష మంజూరు చేయగా, బోర్వెల్ ఏర్పాటుకు మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయానికి నీటి సదుపాయం కల్పించడంతో భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సముద్రాల రాజన్న, మాజీ సర్పంచ్ చంద్రమౌళి, మండల పెరిక కుల సంఘం అధ్యక్షుడు బండి ప్రసాద్ పలువురు నాయకులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల పనులు వేగవంతం చేయాలి: ఎంపిడిఓ

**పెంచికల్ పేట్, జనవరి 2, ప్రభాతవార్త :**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆల్బర్ట్ శుక్రవారం ఎల్కపల్లి, బొంబాయిగూడ చేడ్వాయి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను పరిశీలించారు. ఇండ్ల నిర్మాణం పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు తెలిపారు. ఇంకా ప్రారంభించాని పనులను వెంటనే ప్రారంభించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత కార్యదర్శులు చంద్రశేఖర్, నరేష్, రాకేష్ పాల్గొన్నారు.

## కేకే ఓసీపీలో హెచ్ఎంఎస్ గేట్ మీటింగ్

### - హెచ్.ఏం.ఎస్. జెండా ఆవిష్కరణ చేసిన రియాజ్ అహ్మద్, విజయ్ కుమార్

### - హెచ్.ఏం.ఎస్. యూనియన్‌లో చేరికలు

**మందమర్రి, జనవరి 02, ప్రభాతవార్త**

మందమర్రి ఏరియాలోని కేకే ఓసీపీలో వైస్ ప్రెసిడెంట్ బెడ్డల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా జేబీసీసీఐ సభ్యులు, హెచ్.ఏం.ఎస జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్, మందమరి ఏరియా ప్రెసిడెంట్ విజయ్ కుమార్ హెచ్.ఏం.ఎస జెండా ఆవిష్కరణ చేసారు. రియాజ్ ఆధ్వర్యంలో కేకే ఓసీపీలో కార్మికులు హెచ్.ఏం.ఎస్. యూనియన్‌లోకి చేరికలు జరిగాయి. మందమర్రి ఏరియా లోని కార్మికులకు అండగా ఉంటాము, కేకే ఓసీపీలోని కార్మికులకు హెచ్.ఆర్.ఏ వచ్చేవరకు కొట్లాడుతామనీ, మహిళా కార్మికులకు అండగా హెచ్.ఏం.ఎస్. ఉంటుందనీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ ఇంచార్జ్ వెల్ది సుదర్శన్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ పార్వతి రాజిరెడ్డి, భువన చంద్ర,శ్రీనివాస్ రెడ్డి ,శ్రీరాంపూర్ వైస్ ప్రెసిడెంట్ అనిల్ రెడ్డి, సెక్రటరీ అశోక్, కేకే ఓసీపీ పిట్ సెక్రటరీ మోనిక, నాయకులు పుల్లూరి మహేష్, దుర్గం రామ్ చెందర్, రతన్ సింగ్, సంతోష్, ప్రదీప్, అశోక్, బెడ్డల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# దేశ పౌరులు దేశభక్తి, దైవభక్తి పెంపొందించుకోవాలి

### - విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలి - త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి

**తాండూర్, జనవరి 2, ప్రభాతవార్త :**

భారత దేశ పౌరులు దేశభక్తి, దైవభక్తి పెంపొందించుకోవాలని త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి అన్నారు. ధనుర్మాసోత్స వాల సందర్భంగా ప్రజ్ఞ, వికాస తరంగిణి ఆధ్వర్యంలో స్థానిక విద్యా భారతి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో శుక్రవారం విలువలతో కూడిన విద్య, విజ్ఞానం, సనాతన ధర్మం, భగవద్గీత శ్లోకాలపై స్వామీజీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి ఆధ్వర్యంలో విద్యార్థుల్లో దేశభక్తి, దైవభక్తి, భగవద్గీత పఠనంపై అవగాహన పెంపొందించడానికి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ పౌరుల్లో, విద్యార్థుల్లో చైతన్యం, అవగాహన కలిగిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థికి విలువలతో కూడిన విద్య, విజ్ఞానాన్ని అందించాలన్నారు. భగవద్గీత గ్రంథం మాత్రమే కాదని, అది జీవన మార్గదర్శన్నారు త్రిదండిచిన్న జీయర్ స్వామి సోషల్ మీడియా ద్వారా భక్తులకు రోజు రెండు భగవద్గీత శ్లోకాలు నేర్పిస్తూ అర్థాలు వివరిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల అడిగిన సందేహాలను స్వామీజీ వివరించి నివృత్తి చేసి మంగళ శాసనాలు చేశారు. పాఠశాలకు మొదటిసారి వచ్చిన జీయర్ స్వామినీ పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో వేద పండితులు శ్యాం ప్రణీత్ శర్మ, అర్చకులు కిరణ్ శర్మ వేద మంత్రోచ్చారణలతో పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామికి పాదపూజ చేశారు. కార్యక్రమములో ట్రస్మా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు, వికాస తరంగిణి, ప్రజ్ఞ వికాస సమితి సభ్యులు, విద్యా భారతి విద్యాసంస్థల వ్యవస్థాపకులు సురభి ఆగమారావు, డైరెక్టర్ సురభి శరత్ కుమార్, స్థానిక ప్రముఖులు దత్తాత్రేయరావు బొనగిరి చంద్రశేఖర్, తాళ్లపల్లి దిలీప్, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి



## ప్రతీ రైతు పార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

### - మండల వ్యవసాయాధికారి రామకృష్ణ

**కాగజ్‌నగర్ రూరల్, జనవరి 2, ప్రభాతవార్త :**

ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రామకృష్ణ అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో రైతులకు రైతు రిజిస్ట్రేషన్ పై అవగాహన కల్పించారు. రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవడం వలన కేంద్ర ,రాష్ట్ర వ్యవసాయ పథకాల లబ్ధి సులభంగా పొందవచ్చని వివరించారు. పీఎం కిసాన్ సహాయానికి ఫార్మర్ ఐడి తప్పనిసరి తెలిపారు. ఫార్మ రిజిస్ట్రీ చేయించడం వల్ల రైతు వివరాలు ఖచ్చితంగా నమోదు అయి పారదర్శకత పెరుగుతుందన్నారు. భూమి ఉన్న ప్రతి రైతు తప్పకుంగా ఫార్మ భీమా, సబ్సిడీలు, రుణాలు, ప్రభుత్వ పథకాలు త్వరగా అందుతాయి. ప్రతి రైతుకి ఖచ్చితంగా ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా చేయాలని ఏఈఓలకు సూచించారు. ఫార్మర్ ఐడి ఉంటే స్పష్టమైన గుర్తింపుతో మోసాలు తగ్గుతాయి. రైతు రిజిస్ట్రీ కోసం ఏఈఓలు ఉచితంగా చేసుకోవచ్చని లేదా సేవా కేంద్రాల్లో చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు శ్రీనివాస్, సృజన,రైతులు పాల్గొన్నారు.



## గ్రామ అభివృద్ధికి సమిష్టి కృషి అవసరం: మాజీ జెడ్పిటిసి

**పెంచికల్ పేట్, జనవరి 2, ప్రభాతవార్త :**

ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ప్రజల మద్దతుతో గెలుపొందిన బొంబాయి గూడా నూతన సర్పంచ్ పొట్టే ఉమా మహేష్, ఉప సర్పంచ్ రఘునాథ్, కమ్మర్గాం సర్పంచ్ సులోచన భాస్కర్ గౌడ్ లను శుక్రవారం తాజా మాజీ జెడ్పిటిసి సముద్రాల సరితా రాజన్న శాలువాలతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో రాజకీయాలకు తావు లేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే సామాగ్రా అభివృద్ధి సాధ్యమవుతుందాని అన్నారు.

## గ్రామాల అభివృద్ధిపై దిశానిర్దేశం

**పెంచికల్ పేట్, జనవరి 2, ప్రభాతవార్త :**

పెంచికల్ పేట్ మండల ఎంపిడిఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో ఆల్బర్ట్ ఆధ్వర్యంలో నూతన సర్పంచులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సర్పంచులకు సూచనలు చేశారు. పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణం, వంట షెడ్లు, అంగన్వాడి కేంద్రాల్లో టాయిలెట్ల ఏర్పాటు పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అలాగే ఉపాధి హామీ పథకం కింద ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నూతన గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలు, పాఠశాలలో కాంపౌండ్ వాల్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. పంచాయతీల వారీగా మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేస్తూ గ్రామాల అభివృద్ధికి సమిష్టియ కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ తిరుపతి, ఎంఈఓ రామేష్ బాబు, సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



## ఎస్సై, ఎమ్మార్వోకు నూతన సర్పంచుల సన్మానం

**పెంచికల్ పేట్, జనవరి 2, ప్రభాతవార్త :**

పెంచికల్ పేట్ తహసీల్దార్ తిరుపతి, ఎస్సై అనిల్ కుమార్ ను శుక్రవారం బొంబాయిగూడ, దర్గపల్లి గ్రామాలకు చెందిన నూతన సర్పంచులు సన్మానించారు. బొంబాయిగూడా సర్పంచ్ పొట్టే ఉమా మహేష్, దర్గపల్లి సర్పంచ్ కృష్ణవేణి హరీష్ లు అధికారులను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కార్యక్రమాల అమలులో రెవెన్యూ, పోలీసు శాఖల సహకారం ఎంతో కీలకమని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాగిడే రఘునాథ్, నాయకులు పాల్గొన్నారు.



# బాబాసాహెబ్ పుణ్యంతోనే పదవులు....

## అన్ని వర్గాలను సమానంగా చూస్తూ అభివృద్ధికి బాటలు వేయాలి

**వాంకిడి, డిసెంబర్ 2, ప్రభాతవార్త :**

వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్, వార్డు సభ్యులను బౌద్ధ సంఘం నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఇప్పుడు మనం పొందుతున్న పదవులన్ని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పుణ్యం తోనే దక్కుతున్నాయన్న విషయాన్ని మనం గుర్తు పెట్టుకోని అన్ని వర్గాల అభివృద్ధికి బాటలు వేయాలని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహుల్కర్ అన్నారు. శుక్రవారం ఇటీవల వాంకిడి సర్పంచ్‌గా గెలుపొందిన చునార్కార్ సతీష్, వార్డ్ మెంబర్లు ఉప్రే విమల బాయి,దుర్గం సునీత లకు భారతీయ బౌద్ధ మహా సభ అంబేద్కర్ సంఘం సిద్ధార్థ యోజన సంఘం, రామ బాయి మహిళా మండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన విధంగానే ఈ పాలన వ్యవస్థ నడుస్తుందని ఆయన అన్నారు.

### సర్వతాభివృద్ధికి పాటుపడతా : సన్మాన గ్రహీత సర్పంచ్ సతీష్

తాను పదవిలో ఉన్నంతకాలం ఎటువంటి తారతమ్యం లేకుండా సర్వతాభివృద్ధికి పాటుపడతానని సన్మాన గ్రహీత మేజర్ గ్రామపంచాయతీ వాంకిడి సర్పంచ్ చునార్కట్ సతీష్ అన్నారు. నన్ను గ్రామపంచాయతీ సర్పంచ్ గా గెలిపించిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం వార్డ్ మెంబర్లు,విమల బాయి, సునీత దుర్గే,లు మాట్లాడుతూ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షులు దుర్గం సందీప్,భారతీయ బౌద్ధ మహా సభ అధ్యక్షులు దుర్గం దుర్గాజి, ప్రధాన కార్యదర్శి విజయ్ ఉప్రే, ఉప అధ్యక్షుడు దుర్గం సునీల్, సమాజాధ్యక్షులు శ్యామ్ రావు లహుజీ దుర్గే, రాజేశ్వర్ ఉప్రే, బౌద్ధ ఆచార్యులు వినయ్ బోధి, పాండు జిహాడే, విద్యాసాగర్, రమాబాయి మహిళా మండలి సభ్యులు రిటైర్డ్ సిడిపిఓ సరోజ, పుష్ప,నాయకులు దుర్గం హంసరాజ్ ,కోబ్రగడే విలాస్, ప్రశాంత్,జయంత్ కుమార్,రోషన్, విఠల్,అరుణ్, ప్రతాప్, రాకేష్, ఇంద్రజిత్, నాగ్ సేన్, తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్ వార్డు సభ్యులను సన్మానించిన బౌద్ధ సంఘ నాయకులు



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ ఆనంద్‌రావు

## మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ

**కెరమెరి, జనవరి 2, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని కుమురం భీం ఆదివాసీ భవన్లో శుక్రవారం కెరమెరి సర్పంచ్ పెందోర్ ఆనందరావు, రాజ్ గోండ్ సేవా సమితి, ఆదివాసీ నాయకులు నూతన మరుగుదొడ్ల నిర్మాణానికి ముగ్గు పోసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ కింద రూ. 2లక్షల నిధులతో మరుగుదొడ్లు మంజూరయ్యాయని తెలిపారు. వెంటనే నిర్మాణ పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, రాజ్ గోండ్ సేవా సమితి మండల అధ్యక్షుడు పెందోర్ మోతీరాం, సర్పంచులు కుమురం అంబరావు, తుంరం లచ్చు, నాయకులు సిడం జగన్నాథరావు, ఆత్రం కుసుంరావు, కుడ్మేత సోము, తొడసం జగన్నాథ్ రావు, కుమురం నాణేశ్వర్, జాలింషా, మడవి తుకారాం, ముజీబ్, ఈజీఎస్ అధికారులు ఈసీ లక్య నాయక్, టీఏ అరవింద్ తదితరులు ఉన్నారు.




## వార్త క్యాలెండర్ ఆవిష్కరణ

**వేమనపల్లి, జనవరి 02, ప్రభాతవార్త**

వార్త దినపత్రిక 2026 క్యాలెండర్‌ను నీల్వాయి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రికలు ప్రజా సమస్యలను వెలికి తీయడంతో పాటు సమాజాన్ని సరైన దారిలో నడిపించేలా చూడాలన్నారు. రాజ్యాంగం కల్పించిన గౌరవాన్ని పత్రికలు నిలబెట్టుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వేమనపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, మన తెలంగాణ విలేకరి ప్రవీణ్ కుమార్, వేమనపల్లి ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వార్త విలేకరి ప్రభుదాస్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన ఉప సర్పంచ్

**ఉట్నూర్, జనవరి 2, ప్రభాతవార్త**

మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సరం సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ భోజ్జుని మర్యాదపూర్వకంగా లింగోజితండా గ్రామపంచాయతి ఉప సర్పంచ్ జాదవ్ హరి నాయక్ కలిశారు. ఈ సందర్భంగా శాలువాలతో సన్మానించి, పూల భోక్కే అందించి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే ప్రతి ఒక గ్రామపంచాయతిలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లింగోజితండా ఎక్స్ రోడ్డు గ్రామ నాయక్ నాందేవ్ నాయక్, లింగన్నలు ఉన్నారు.



ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు ని శాలువాలతో సన్మానించిన ఉప సర్పంచ్ జాదవ్ హరి నాయక్ ఉట్నూర్,

## బిఆర్ఎస్ పార్టీలో చేరికలు

**ఉట్నూర్, జనవరి 2, ప్రభాతవార్త :**



ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ భూక్యా జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో ఉట్నూర్ మండలంలోని లక్కారం గ్రామస్తులు బీజేపీ,కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు శుక్రవారం బి ఆర్ ఎస్ పార్టీ లో చేరారు.ఈ సందర్భంగా భూక్యా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని, ఖానాపూర్ ప్రజల కోసం తన పోరాటం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.. అందరం కలిసికట్టుగా పనిచేసి వచ్చే ప్రతి ఎన్నికలో బీఆర్ఎస్ జెండాను ఎగరవేద్దాం అని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ శక్తి మరింతగా పెరిగి, ప్రజల ఆశయాలు నెరవేరే దిశగా పోరాడుతూ ముందుకు సాగుతుందని పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో లక్కారం గ్రామ పంచాయతీ సర్పంచ్ అజ్మీరా రేణుకా, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, యువ నాయకులు, గ్రామ యూత్ , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపులు, స్క్రాప్ దుకాణాలను తొలగించాలి

### సర్పంచ్, కార్యదర్శికి వినతిపత్రం ఇచ్చిన యువకులు, మహిళలు

**తాండూర్, జనవరి 2, ప్రభాతవార్త :**

మండలంలోని కిష్టంపేట గ్రామ పంచాయతీలో గల బెల్ట్ షాపులు, స్క్రాప్ దుకాణాలను వెంటనే తొలగించాలని శుక్రవారం స్థానిక సర్పంచ్ సార్ల తిరుపతి, పంచాయతీ కార్యదర్శి ఉదయ్ కి స్థానిక యువకులు, మహిళలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ కొందరు యువకులు రాత్రి వేళల్లో ఇళ్లల్లో చొరబడి దొంగతనాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇళ్లలో దొంగలించిన వస్తువులను స్క్రాప్ దుకాణాల్లో అమ్ముతు, బెల్ట్ షాపుల్లో యువకులు అతిగా మద్యం సేవించి తప్పుదారి పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిబంధనాలకు విరుద్ధంగా నడుస్తున్న బెల్ట్ షాపులు, స్క్రాప్ దుకాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యువకులు ధర్మరాజుల రమేష్, పాగిడి చిరంజీవి, ఏముర్ల ప్రదీప్, ఏముర్ల ప్రవీణ్, పసూల ప్రమీల, సూర్ల భాను, మేడి రాజమ్మ, మేడి రవికుమార్, శ్రావణ్, కామెర రమేష్, కామెర మహేష్, చల్లూరి ప్రసాద్, మేడి రవి, కస్తూరి భవాని, మేడి భవాని, సుజాత, తదితరులు పాల్గొన్నారు.





పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ భరద్వాజ్

## పారిశుధ్య పనులు చేయించిన సర్పంచ్

**రెబ్బెన, జనవరి 2, ప్రభాతవార్త :**

రెబ్బెన గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్‌టి కాలనీలో శుక్రవారం రెబ్బెన గ్రామ సర్పంచ్ దుర్గం భరద్వాజ్ పారిశుధ్య పనులు చేయించారు. డ్రైనేజ్ క్లీనింగ్, కాలువ పూడికలు, ముళ్లపొదలు, దగ్గరుండి శుభ్రం చేపించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని, దృష్టిలో ఉంచుకొని గ్రామంలో పారిశుధ్య పనులు చేయించడం జరిగిందని తెలిపారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా ప్రతీ ఒక్కరు పరిశుభ్రత పాటించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో,వార్డు సభ్యులు అజ్మీర పరశురాం, అజ్మీర ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు,

## రోడ్డు భద్రతపై అవగాహన

**కెరమెరి, జనవరి 2, ప్రభాతవార్త:**

రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ఎన్.మధుకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం నుండి. సాకడ గ్రామం ఎక్స్ రోడ్ వరకు 100 మంది యువకులతో హెల్మెట్ ధరించి బైకు ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వాహన పత్రాలు సమగ్రంగా కలిగి ఉండాలన్నారు ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు.

